సాక్షి
ప్రకాశం
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



సోనాబోటు..జీవనోపాధిపై చోటు
జిల్లాలో మత్స్యకారులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కడలూరుకు చెందిన బోట్లు జిల్లా తీరానికి దగ్గరగా వేటచేస్తున్నాయి. - 8లో..



గంజాయి విక్రేతపై పీడీ యాక్ట్
పోలీసుల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ గంజాయి విక్రయిస్తున్న మహిళపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /24

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.



న్యూస్‌రీల్

నారాయణ స్వామి ఆదాయం రూ.1,73,965

సీఎస్‌పురం (పీసీపల్లి): సీఎస్‌పురం మండల పరిధిలోని మిట్టపాలెంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నారాయణ స్వామి దేవస్థానానికి ఆదివారం రూ.1,73,965 ఆదాయం వచ్చినట్లు ఈఓ ఎస్.నారాయణరెడ్డి తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.65,870, లడ్డుప్రసాదం అమ్మకం ద్వారా రూ.23,610, అన్నదాన విరాళాల ద్వారా రూ.42,568, మహాప్రాకార నిర్మాణానికి రూ.41,917 వచ్చినట్లు తెలిపారు. అన్నదానానికి రూ.30 వేలు గిద్దలూరుకు చెందిన ఎం శివసత్యనారాయణ, ఆదిలక్ష్మి దంపతులు అందజేశారు. వీరిని ఆలయ ఈఓ ఘనంగా సన్మానించారు.

13న డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

ఒంగోలు: డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 165 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు కాంట్రాక్టు నిబంధనల కింద మినిమం టైమ్ స్కేలుతో నియమించేందుకు షెడ్యూలును జారీచేశారని, పూర్తి వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఉంచారన్నారు. ఈ వెబ్‌సైట్‌లో 165 మంది అభ్యర్థుల క్వాలిఫైడ్ సీనియార్టీ జాబితాను ఉంచారని, అభ్యర్థులు ఈనెల 13న సాయంత్రం 3 గంటలకు ప్రకాశం భవనంలోని స్పందన మీటింగ్ హాలులో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్, ఇంటర్వ్యూ కాల్ లెటర్, ఎస్ఎస్సీ సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, డిగ్రీ సర్టిఫికెట్, బీఈడీ/డీఈడీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్టుసైజు ఫొటోలు 3, కాంట్రాక్టు అగ్రిమెంట్ తీసుకుని హాజరుకావాలన్నారు.

సామాజిక చైతన్యం కోసం మాలకొండారెడ్డి కృషి


మాలకొండారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: సామాజిక చైతన్యమే లక్ష్యంగా నిబద్ధతగా రచనలు చేసిన కవి ఉండేల మాలకొండారెడ్డి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. స్థానిక మంగమూరు రోడ్డులో ప్రముఖ కవి, రచయిత, చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉండేల మాలకొండా రెడ్డి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత గ్రంథపాలకుడు గోదా గురువారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో పాల్గొన్న పొన్నూరు మాట్లాడుతూ మాలకొండ నోట మంచి మాట, దైవానికి మతం లేదు, మానవతా గీత, నేతాజీ, వివేకానందుడు, సత్యం శివం సుందరం రచనలు విశేషమైన ప్రాచుర్యం పొందాయని చెప్పారు. ఆయన సాహిత్యానికి గుర్తింపుగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పురస్కారం, ఇందిరా గాంధీ నేషనల్ అవార్డు, దాశరథి అవార్డులు వంటి అనేక పురస్కారాలు లభించాయని గుర్తు చేశారు. తొలుత మాలకొండారెడ్డి చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సేల్స్ ట్యాక్స్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ రావూరి సదానంద రావు, పి.శివ, గోదా రమణమ్మ, రఘు తదితరులు పాల్గొన్నారు.

త్రిముఖ దుర్గాదేవికి బంగారం, వెండి ఆభరణాలు

సీఎస్‌పురం (పీసీపల్లి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో వెలసిన త్రిముఖ దుర్గాదేవికి భక్తులు ఆదివారం బంగారం, వెండి ఆభరణాలు బహూకరించినట్లు ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి తెలిపారు. సుమారు రూ.43,844 విలువ చేసే బంగారు మంగళసూత్రాలు, ముక్కు పుడక, వెండికళ్లు, వెండి చెంబు అందించారన్నారు. వీటిని నెల్లూరు జిల్లా కోవూరు మండలం పాటూరు గ్రామానికి చెందిన సన్నమూరు విజయకుమారి ఆచారి, మల్లీశ్వరి దంపతులు అందజేశారు.

అగ్రవర్ణ పేదల సంక్షేమాన్ని గత ప్రభుత్వాలేవీ పట్టించుకోలేదు. అటువంటి వారికి ఆపన్న హస్తం అందించేందుకు కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, వెలమ, ఇతర అగ్రవర్ణ పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.15 వేలు వారి ఖాతాల్లో నేరుగా జమచేసి వారికి ఆర్థిక చేయూతనందిస్తున్నారు. ఇప్పటికే ఒక విడత ఆర్థిక సాయం చేయగా.. రెండో విడత నగదు ఈనెల 12న జమచేయనున్నారు.



నిరుపేదల నేస్తం

- జిల్లాలో 39,409 మంది ఈబీసీలకు ఆర్థిక చేయూత
- అగ్రవర్ణ పేదలకూ అండగా ప్రభుత్వం
- ఈనెల 12న మార్కాపురంలో నిధులు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.59.11 కోట్లు వ్యక్తిగత ఖాతాల్లో జమ
- కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, వెలమ, ఇతర అగ్రవర్ణ పేదలకు ఆర్థికసాయం

ఒంగోలు:

ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే వారు ఎవరైనా వారిని ఆదుకోవడం కనీస ధర్మంగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపులతోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు అండగా ఉండాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికి సంబంధించి రెండో విడత ఈబీసీ నేస్తం నిధులను ఈనెల 12న విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కాపురం రానున్నారు. ఈబీసీలలో ప్రధానంగా రాష్ట్రంలో కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్య వైశ్య, క్షత్రియ, వెలమ సామాజిక వర్గాలతోపాటు ఇతర అగ్రవర్ణాల్లోని పేదలు 39,409 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున మహిళల ఖాతాల్లో రూ.59,11,35,000 జమచేయనున్నారు. జిల్లాలోని 38 మండలాలు, 8 నియోజకవర్గాల్లోని కమ్మ 12,881, రెడ్డి 20,932, ఆర్యవైశ్య 4032, బ్రాహ్మణ 759, క్షత్రియ 250, వెలమ 93, ఇతర అగ్రవర్ణ పేదలు 462 వెరసి 39,409 కుటుంబాలకు ఈ ప్రయోజనం దక్కనుంది.

జిల్లాలో లబ్ధిదారుల వివరాలు సామాజిక వర్గం వారీగా

నియోజకవర్గం	కమ్మ	రెడ్డి	ఆర్యవైశ్య	బ్రాహ్మణ	క్షత్రియ	వెలమ	ఇతర అగ్రవర్ణాలు	మొత్తం లబ్దిదారులు
దర్శి	1947	3534	298	60	1	42	59	5941
గిద్దలూరు	207	3104	726	32	1	0	56	4126
కనిగిరి	1071	3385	343	53	35	9	37	4933
కొండపి	3726	2241	399	103	107	0	59	6635
మార్కాపురం	569	3165	764	67	1	1	73	4640
ఒంగోలు	1180	1632	821	316	47	30	92	4118
సంతనూతలపాడు	3083	1224	323	86	58	5	57	4836
యర్రగొండపాలెం	1098	2647	358	42	0	6	29	4180
మొత్తం	12881	20932	4032	759	250	93	462	39409

ఈబీసీ నేస్తంతో దుకాణం పెట్టుకున్నా



సీఎం జగన్ మాలాంటోళ్ల జీవనం కోసం ఈబీసీ నేస్తం పెట్టి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తున్నారు. ఈ డబ్బుతో నేను చిల్లర దుకాణం పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రెండో విడత కింద వచ్చే డబ్బుతో దుకాణాన్ని అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా బలపడతాను. అప్పులు చేయకుండా మాకు ఈబీసీ నేస్తం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.
– చిల్లంకూరి శేషమ్మ, యర్రగొండపాలెం

పేదవారికి అండగా ప్రభుత్వ పథకాలు



వైఎస్సార్ ఈబీసీ నేస్తం మా కుటుంబానికి అండగా నిలిచింది. చిన్నపాటి బంకు పెట్టుకుని జీవిస్తున్నా. నాకు ముగ్గురు అమ్మాయిలు, ఒకరికి వివాహమైంది. చివరి అమ్మాయి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉచితంగా డిగ్రీ చదువుతోంది. నా భర్తకు ప్రతి నెలా పింఛన్ రూ.2750 వస్తుంది. ప్రభుత్వం అందించే పథకాలు మాలాంటి పేదవారికి అండగా ఉంటున్నాయి.
– గోళ్ల వెంకట రత్నమ్మ, బేస్తవారిపేట

పాల వ్యాపారంతో కుటుంబానికి సహాయం



వైఎస్ఆర్ ఈబీసీ నేస్తంలో గత ఏడాది నా అకౌంట్‌లో రూ.15 వేలు జమయ్యాయి. దాంతో పాటు దాచుకున్న డబ్బులతో పాడిగేదె కొనుక్కొని రోజూ పాల కేంద్రానికి పాలు పోస్తున్నాను.
– మల్లెల సత్యనారాయణమ్మ, తూర్పు వీధి, మార్కాపురం

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకంలో గత ఏడాది నేను లబ్ధిపొందాను. రూ.15 వేల వచ్చాయి. ప్రతి నెలా ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడానికి ఆ డబ్బు ఉపయోగపడింది. నాకు వితంతువు పింఛన్ కూడా వస్తోంది. ఈబీసీ నేస్తం పథకం వలన నాలాంటి నిరుపేదలు మేలు. జగనన్న పేదప్రజల కోసం చాలా మంచి పనులు చేస్తున్నాడు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని దేవుని ప్రార్థిస్తాను.
– గుజ్జుల రవణమ్మ, ఏలూరు, పొదిలి మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



అగ్రకులాల్లోని మాలాంటి పేదలకు సీఎం జగనన్న కల్పించిన ఈబీసీ నేస్తం ఆర్థికసాయంగా నిలుస్తోంది. గతంలో నేను ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు పొందా. ఇంటికి మరమ్మతులు చేయించుకున్నా. ఈసారి జాబితాలో కూడా నాపేరు ఉంది. ఈసారి వచ్చే డబ్బులతో గ్రైండర్ కొని బతుకుదెరువు కోసం ఉపయోగించుకుంటా. సీఎంకు రుణపడి ఉంటాం.
– తబీలు సుబ్బరత్తమ్మ, పామూరు

ఈబీసీ నిధులతో పాడి గేదెల కొనుగోలు



గత ఏడాది మొదటి విడత ఈబీసీ పథకంలో నాకు రూ.15 వేలు వచ్చాయి. ఆ నిధులతో పాటు మరి కొంత డబ్బులు వేసుకొని పాడి గేదెలు కొనుక్కున్నాను. దీంతో పాల వ్యాపారం చేస్తున్నా. జగనన్నకు కృతజ్ఞతలు.
– దుగ్గెంపూడి సుబ్బులక్ష్మమ్మ, తర్లుపాడు

పశ్చిమ ప్రకాశంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ


వెలిగొండ ప్రాజెక్టు పనుల ఫొటో గ్యాలరీ, టన్నెల్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

- వందల కోట్లతో అభివృద్ధి పనులు
- వడివడిగా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం
- చేతల మనిషిగా ప్రజల మనసులో సీఎం జగన్
- పశ్చిమ ప్రకాశంపై చంద్రబాబు నిర్లక్ష్యం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం. మాటల మనిషిగా కాకుండా చేతల మనిషిగా పశ్చిమ ప్రకాశం ప్రజల మనసుల్లో సీఎం నిలిచిపోయారు. ఒక చారిత్రాత్మక పథకాన్ని రెండో విడత ప్రారంభించేందుకు ఈ నెల 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం వస్తున్నారు. సీఎం రాక కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు పశ్చిమ ప్రకాశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా అదుగో ఇదుగో అంటూ కాలయాపన చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు అతి తక్కువ నిధులు కేటాయించడంతో అవి సిబ్బంది జీత భత్యాలకే సరిపోయాయి. ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగాయి. అప్పట్లో జిల్లాకు చంద్రబాబు చాలా సార్లు వచ్చినా మార్కాపురానికి మాత్రం రాలేదు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండకు నిధులు కేటాయించడంతో పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. 2020 ఫిబ్రవరి 20 తేదీన దోర్నాలలో వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ పనులను పరిశీలించేందుకు వచ్చారు. గత ఏడాది డిసెంబర్ 28న మంత్రి సురేష్‌కు మాతృవియోగం కలగగా పరామర్శించేందుకు యర్రగొండపాలెం వచ్చారు.

తాజాగా మార్కాపురం రాక

ఈబీసీ నేస్తం రెండో విడత పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం హోదాలో పశ్చిమ ప్రకాశానికి రెండోసారి, మార్కాపురం పట్టణానికి మొదటిసారి వస్తున్నారు. ఒక బృహత్తర పథకానికి ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల వేదికకానుంది. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలతో పాటు కనిగిరి, దర్శి సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో మార్కాపురం రానున్నారు. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. సీఎం పర్యటన కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 39,409 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నగదు జమ కానున్నాయి. 40 సంవత్సరాల వయసు ఉన్న ఈబీసీల వారికి ఈ పథకం అమలుకానుంది. డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేయనున్నారు.

వందల కోట్లతో అభివృద్ధి:

వెనుకబడిన పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం నియోజకవర్గంలో అన్ని విభాగాల్లో కలిపి దాదాపు రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు వివిధ దశల్లో సాగుతున్నాయి. ముఖ్యంగా మార్కాపురంలో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ పనులు సాగుతున్నాయి. పొదిలిలో సాగర్ నీటిని ప్రజలకు అందించేందుకు పెద్ద చెరువు కోసం రూ.55 కోట్లు కేటాయించారు. మార్కాపురం పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య నివారణకు రూ.25 కోట్లు కేటాయించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దదోర్నాలలో రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను మంజూరు చేశారు.


వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తున్న సీఎం వైఎస్ జగన్, పక్కన ఆదిమూలపు సురేష్, బాలినేని శ్రీనివాసరెడ్డి (ఫైల్)

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, ఎమ్మెల్యే కేపీ

- పర్యటించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఈ నెల 12న ఈబీసీ నేస్తం ప్రారంభానికి వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు దాదాపు పూర్తికావొచ్చాయని కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికా గర్గ్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చెప్పారు. సోమవారం వారు హెలిప్యాడ్, సభాస్థలి ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ ద్వారా సీఎం పర్యటనకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ చెప్పారు. ప్రజలు సీఎం ప్రసంగించే వేదిక వద్ద దాదాపు 35 వేల మంది కూర్చునేందుకు గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పబ్లిక్ క్రౌడ్ మేనేజిమెంట్ పై చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. వారి వెంట జేసీ అభిషిక్త్ కిషోర్, సబ్ కలెక్టర్ సేధు మాధవన్ ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తి కావచ్చాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సభా ప్రాంగణం వద్ద విలేకర్లకు తెలిపారు. దాదాపు 35 నుంచి 40 వేల మంది వరకు సభా ప్రాంగణంలో కూర్చునేందుకు, మరో 10 నుంచి 15 వేల మంది సీఎం ప్రసంగాన్ని దగ్గర్లో ఉండి వినేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎండ వేడి తట్టుకునేలా కూలర్లు, ఫ్యాన్లు బిగించడంతో పాటు మీటింగ్‌కు వచ్చే ప్రజలకు మజ్జిగ, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మొబైల్ టాయిలెట్స్ కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు కృషి చేయాలన్నారు. ఈయన వెంట సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మెన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మెన్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

సీఎం జగన్ పర్యటనకు సంబంధించి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సీఎం సభకు వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. తనతో పాటు ముగ్గురు అదనపు ఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, 1700 మంది పోలీసులు సీఎం బందోబస్తులో ఉంటారన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ద్వారా పూర్తి స్థాయి భద్రత కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సీఎం కాన్వాయ్ రూట్ మ్యాప్‌లు పరిశీలించామని, హెలిప్యాడ్ నిర్మాణం చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించామన్నారు. సీఎం ప్రసంగించే సభా వేదిక నిర్మాణం, ప్రజలు లోపలికి వచ్చే, పోయే మార్గాలు, వీవీఐపీ, వీఐపీ వాహనాల పార్కింగ్ బందోబస్తు పై సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఆమె వెంట ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అంకిత సురాన, అడిషనల్ ఎస్పీ కే నాగేశ్వర రావు, ఎస్ఎస్‌జీ డీఎస్పీలు విశ్వనాథ్, కే శ్రీనివాస్, డీఎస్‌బీ డీఎస్పీ మరియదాస్, మార్కాపురం, దర్శి దిశ, డీటీసీ డీఎస్పీలు కిషోర్‌కుమార్, నారాయణస్వామి రెడ్డి, పల్లపు రాజు, రామకృష్ణ, ఏఆర్‌డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బీమా నాయక్, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, ఎస్ఐలు ఉన్నారు.


సభా ప్రాంగణం వద్ద పార్టీ నాయకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

స్పందన అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

- డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అర్జీల తాలూకు సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సహేతుకంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆర్ శ్రీలత అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా పక్కాగా పరిష్కరించాలన్నారు. ప్రజలు ఇచ్చే అర్జీలు నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం చూపడంలో అర్జీదారులు సంతృప్తి చెందేలా పనిచేయాలన్నారు. దీనిలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి మాధురి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

- పుల్లలచెరువు మండలం సీ కొత్తపల్లి గ్రామానికి చెందిన మండడి తిరుపతమ్మ స్పందనలో అధికారులను కలిసి తన గుండెకు ఇన్‌ఫెక్షన్ సోకి మందులు వాడుతున్నానని తెలిపారు. మందులు కొనలేని పరిస్థితిలో ఉన్నానని తనకు డీఎంహెచ్‌ఓ కింద పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- ఒంగోలు మండలం మండవవారిపాలెంకు చెందిన యక్కల వెంకటలక్ష్మి స్పందనలో అధికారులను కలిసి తనకు వస్తున్న పింఛన్ నిలుపుదల చేశారని తిరిగి, పునరుద్ధరించాలని కోరుతూ అర్జీ అందజేశారు. పింఛన్ ఆధారంతో జీవనం కొనసాగిస్తున్నానని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

నేడు 'జగనన్నే మా భవిష్యత్'

ఒంగోలు: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విభాగం జోనల్ ఇన్‌ఛార్జి బొట్ల సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి

ఒంగోలు: మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక నూతన కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పుష్పాలంకరణ, 10 గంటలకు ప్రకాశం భవనంలోని స్పందన కాన్ఫరెన్స్‌హాలులో సభా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, వెనుకబడిన తరగతుల కులాలు, ఇతర సంఘ నాయకులు హాజరై రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో

ఒంగోలు: మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

త్రిపురాంతకం సీఐగా పాపారావు

ఒంగోలు టౌన్: త్రిపురాంతకం సీఐగా బి.పాపారావును బదిలీ చేస్తూ గుంటూరు రేంజి డీఐజీ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు. రేంజి వీఆర్‌లో ఉన్న ఆయన్ను త్రిపురాంతకానికి పోస్టింగ్ ఇచ్చారు. త్రిపురాంతకంలో విధులు నిర్వహిస్తున్న ఎం.రాంబాబును రేంజి వీఆర్‌కు పంపించారు.

అక్రమాలకు పాల్పడిన ఉద్యోగుల తొలగింపు

పుల్లలచెరువు: మండలంలోని నరజాములతండా వద్ద ఉన్న ఫారెస్టు చెక్‌పోస్టులో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడడంతో వారిని ఉద్యోగం నుంచి తొలగించినట్లుగా ఫారెస్టు అధికారి నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, గేట్ హెల్పర్ నాగేశ్వర్‌నాయక్, ఇష్మాయిల్, రామాంజనేయనాయక్‌లు కలిసి వాహనదారుల వద్ద నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తుండడంతో డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు వారిని తొలగించామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ హోమియో దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ఒంగోలు అర్బన్: అంతర్జాతీయ హోమియో దినోత్సవ వేడుకలు స్థానిక ఆయుష్ కార్యాలయంలో సోమవారం హోమియో సీనియర్ వైద్యులు టి.భీమనాథ్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మజాతి హాజరై సీఎఫ్ఎస్ హానిమన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హోమియో వైద్యానికి ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు. హోమియో మందుల వాడకం, హోమియో వైద్య విధానాలను వివరించారు. దీనిలో ప్రభుత్వ హోమియో, ఆయుర్వేద, యునాని వైద్యశాలల వైద్యులు, కాంపౌడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల డీబార్

ఒంగోలు: పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డీబార్ చేశారు. సోమవారం జరిగిన గణితం పరీక్షకు 29218 మంది హాజరుకావాల్సి ఉండగా 29075 మంది మాత్రమే హాజరయ్యారు. చీమకుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరీక్షల పరిశీలకుడు ప్రసన్నకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేయగా ఒకే రూములో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. దీంతో ఇన్విజిలేషన్ డ్యూటీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలిని పరీక్షల విధుల నుంచి తప్పిస్తూ తక్షణ ఉత్తర్వులు జారీచేశారు. చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, బొద్దికూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, అమెరికన్ పబ్లిక్ స్కూలు, తూర్పు గంగవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రగతి హైస్కూలులో పరిశీలకులు ప్రసన్న కుమార్ తనిఖీలు నిర్వహించారు. డీఈఓ 5 సెంటర్లు, స్క్వాడ్ బృందాలు 67 సెంటర్లలోను తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడిన ఘటన మినహా పరీక్షలు పూర్తి ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ తెలిపారు.

జిల్లాలో మత్స్యకారులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఏడాది కాలంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు బోట్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తీరం వెంబడి చేపల వేట సాగిస్తుండటంతో మత్స్యసంపద దొరకక అప్పుల పాలవుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. కడలూరు సోనా బోట్లను కట్టడి చేయడానికి జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నా పరిస్థితి పునరావృతమవుతుండటంతో మత్స్యకారులు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు.

పాకల వద్ద తీరానికి దగ్గరగా చేపలవేట చేస్తున్న కడలూరు సోనాబోట్లు



జీవనోపాధిపై వేటు

- జిల్లా మత్స్యకారుల పాలిట శాపంగా మారిన కడలూరు సోనాబోట్లు
- నిబంధనలు అతిక్రమించి వేట సాగిస్తున్న సోనాబోట్లు
- చేపల వేట సరిగా లేక అప్పులపాలవుతున్న మత్స్యకారులు
- కడలూరు బోట్లను కట్టడి చేయాలని కోరుతున్న మత్స్యకారులు



సోనాబోట్లను నిస్సహాయ స్థితిలో చూస్తున్న జాలర్లు

సింగరాయకొండ: జిల్లాలోని తీరప్రాంత మండలాలైన కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండలో సుమారు 1,300 మోటరైజ్డ్ బోట్లు, నాన్ మోటరైజ్డ్ బోట్లు ఉండగా సింగరాయకొండ మండలంలో 319 మోటరైజ్డ్, 93 నాన్ మోటరైజ్డ్ బోట్లు ఉన్నాయి. నాన్ మోటరైజ్డ్ బోట్లు సముద్రంలో తీరం నుంచి 2 కిలోమీటర్ల వరకు, మోటరైజ్డ్ బోట్లు తీరం నుంచి 8 కిలోమీటర్ల వరకు, సోనాబోట్లు తీరం నుంచి 8 కిలోమీటర్ల తర్వాత మాత్రమే చేపల వేట సాగించాలి.

యథేచ్ఛగా నిబంధనల అతిక్రమణ

జిల్లా పరిధిలోని మండలాల్లో సోనా బోట్లు లేవు. కేవలం మోటరైజ్డ్, నాన్ మోటరైజ్డ్ బోట్లు మాత్రమే ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు, కేంద్రపాలిత ప్రాంతం పాండిచ్చేరికి చెందిన సోనాబోట్లు ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో చేపల వేట సాగిస్తున్నాయి. సోనాబోట్లు ప్రధానంగా నిబంధనలు అతిక్రమించి తీరానికి అర కిలోమీటరు దూరంలో చేపల వేట సాగిస్తుండటంతో జిల్లాలోని మత్స్యకారుల వలలు తెగిపోయి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. మత్స్య సంపద కూడా లభించని దుస్థితి ఏర్పడింది. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు.

అడ్డుకుంటున్నా ఆగని తీరు

జిల్లా యంత్రాంగం కడలూరు బోట్లను అడ్డుకునే ప్రయత్నం చేసినా వారు ఖాతరు చేయడం లేదు. గత మూడు నెలల కాలంలో ఒక సారి కొత్తపట్నం పరిధిలో, ఇంకోరి పాకల పరిధిలో మత్స్యశాఖ, మెరైన్ అధికారులు సంయుక్తంగా కడలూరు బోట్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. శనివారం నెల్లూరు జిల్లా కావలి మున్సిపాలిటీ పరిధిలో ఇసుకపల్లి సముద్ర తీరంలో కడలూరు బోట్లను ఆ ప్రాంత మత్స్యకారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తమిళ జాలర్లు రాళ్ల దాడికి పాల్పడటంతో ఇసుకపల్లి మత్స్యకారులు ఇద్దరికి గాయాలయ్యాయి. రోజూ 4 నుంచి 8 వరకు సోనాబోట్లు వస్తుండగా ఆదివారం మాత్రం 20 వరకు సోనాబోట్లు సముద్రతీరంలో అర కిలోమీటరు పరిధిలో చేపల వేట సాగించాయి. దీంతో మత్స్యకారులు ఏమి చేయలేక నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. దీనిపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చలు జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని మత్స్యకారులు కోరుతున్నారు.



చేపల వేట సరిగా లేక తీరానికే పరిమితమైన బోట్లు

సోనా బోట్లను అడ్డుకోకపోతే కష్టమే..



నేను ఆదివారం వేటకు వెళ్లా. 2 వేల రూపాయల విలువైన ఎండ్రకాయలు పడ్డాయి. నాకు డీజిల్, కూలి ఖర్చులు కలిపి 5 వేల రూపాయలైంది. అంటే 3 వేల రూపాయలు నష్టపోయా. శనివారం వేటకు వెళ్తే కేవలం 50 రూపాయల చేపలే వలకు చిక్కడంతో రూ.5 వేలు నష్టం వచ్చింది. కడలూరు బోట్లను అడ్డుకోనంత కాలం మేము అప్పులపాలు కావాల్సిందే.

– వాయిల సుబ్బారావు, పోతయ్యగారి పట్టపుపాలెం, పాకల

వలలు తెగిపోతున్నాయి



గతంలో ఐలా వలతో చేపల వేట సాగించా. రానురాను కడలూరు బోట్ల పుణ్యమా అని చేపల వేట బాగా లేక అప్పుల పాలయ్యా. ప్రస్తుతం నాన్ మోటరైజ్డ్ బోటుతో చేపల వేట చేస్తున్నా. ఇటీవల రూ.18 వేలకు వల కొన్నా. రెండు రోజుల్లోపే సోనా బోట్ల కారణంగా వల తెగి సముద్రంలో కొట్టుకుపోయింది. మళ్లీ రూ.16 వేలతో ఇంకో వల కొన్నా. ఈ వల ఎన్నిరోజులు ఉంటుందో అర్థం కావటం లేదు. శనివారం సాయంత్రం వేటకు వెళ్లి వస్తే రూ.500 విలువైన చేపలు, ఎండ్రకాయలు పడ్డాయి.

– కుమారి ఉత్తరయ్య, పోతయ్యగారి పట్టపుపాలెం

తమిళ అధికారుల నుంచి స్పందన లేదు

కడలూరు బోట్లు నిబంధనలకు విరుద్ధంగా తీరం వెంబడి చేపలను వేటాడుతున్నాయి. వీరిని అడ్డుకోవటానికి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. కానీ ఆ రాష్ట్ర అధికారుల నుంచి సరైన స్పందన లేదు. ఇటీవల రెండు సార్లు స్థానిక మత్స్యకారుల సహకారంతో సోనాబోట్లను అడ్డుకున్నాం. రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా.

– చంద్రశేఖరరెడ్డి, జిల్లా మత్స్యశాఖాధికారి

గంజాయి విక్రేతపై పీడీ యాక్ట్

- కడప సెంట్రల్ జైలుకు తరలింపు
- గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరిక



ఒంగోలు టౌన్: పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ గంజాయి విక్రయిస్తున్న మహిళపై ఎస్పీ మలికా గర్గ్ పీడీ చట్టాన్ని ప్రయోగించి జైలుకు పంపారు. ఈ మేరకు ఎస్పీ సోమవారం ఒక ప్రకటనలో పూర్తి వివరాలు వెల్లడించారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి చెందిన కుంభా మాధవి గత రెండేళ్లుగా గంజాయి విక్రయిస్తోంది. ఈ క్రమంలో సెబ్ అధికారులు, పోలీసుల దాడుల్లో ఆరు సార్లు పట్టుబడగా కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. అయినా ఆమెలో ఎలాంటి మార్పు రాలేదు. నేర ప్రవృత్తిని మార్చుకోలేదు. ఒంగోలు చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులు, యువకులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలు కొనసాగిస్తోంది. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ ఆమెపై పీడీ చట్టం ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌కు పంపారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కుంభా మాధవిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల యువత జీవితం నాశనమవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. కొత్త స్నేహాలతో కాలేజీ విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, సరదా పేరుతో మాదక ద్రవ్యాలు వాడటం మొదలుపెట్టి చివరికి బానిసలవుతున్నారని చెప్పారు. గంజాయి మత్తులో కొందరు దొంగతనాలు, చైన్ స్నాచింగులకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారిని కాపాడేందుకు ఫైట్ ఎగెనెస్ట్ డ్రగ్స్ అనే నినాదంతో సంకల్పం అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలోని పలు కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేసి పదేపదే గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను విక్రయించే వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా నాటుసారా తయారు చేస్తున్నా, గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నా, గంజాయి సేవిస్తున్నా వెంటనే సెబ్ టోల్ ఫ్రీ నంబర్ 14500, డయల్ 100, 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శశికుమార్

మార్కాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 12న మార్కాపురం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపుతో పాటు నిబంధనలు కూడా విధిస్తున్నామని, ప్రజలు సహకరించాలని పట్టణ ఎస్సై శశికుమార్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గిద్దలూరు, కంభం వైపు నుంచి, అలాగే యర్రగొండపాలెం-గుంటూరు రోడ్డులో వచ్చే వాహనాలు దేవరాజు గట్టు మీదుగా మార్కెట్ యార్డు జంక్షన్ దాటి సభాస్థలి అయిన ఎస్వీకేపీ కాలేజీ సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ దగ్గర ప్రజలను దింపి ఆర్టీసీ గ్యారేజీ ఎదురుగా పార్కింగ్ చేయాలని సూచించారు.

- తర్లుపాడు వైపు నుంచి సభాస్థలికి వచ్చే ప్రజలు కోర్టు సెంటర్, ఏస్టేట్, వైజంక్షన్ గుండా కళాశాల దగ్గరకు చేరుకుని ప్రజలను దించి బోడపాడు హైవే ఎదురు పోలీసులు ఏర్పాటు చేసిన వెంచర్‌లో వాహనాలు పార్కింగ్ చేయాలని చెప్పారు.
- వీఐపీ పాస్ ఉన్నవారు కళాశాల గ్రౌండ్ ఎదురుగా పోలీస్ వారు ఏర్పాటు చేసిన వీఐపీ కార్ పార్కింగ్‌లో వాహనాలు నిలపాలని కోరారు.
- మోటరుసైకిళ్లపై వచ్చే వారికి సౌజన్య ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న రైస్ మిల్లులో పార్కింగ్ స్థలం కేటాయించినట్లు తెలిపారు. గిద్దలూరు, కంభం, గుంటూరు, యర్రగొండపాలెం, దోర్నాల నుంచి వచ్చే బస్సులు, లారీలు అన్నీ దేవరాజుగట్టు వైజంక్షన్, కోర్టు సెంటర్ మీదుగా మార్కాపురం టౌన్‌లోకి ప్రవేశించాలని సూచించారు.

వ్యాళి వాహనంపై వామనుడిగా

చెన్నకేశవుడు



వ్యాళి వాహనంపై వామన అలంకారంలో దర్శనమిస్తున్న లక్ష్మీచెన్నకేశవ స్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారు వామన అలంకారంలో వ్యాళి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి విగ్రహాలను ఉత్సవ పీఠంపై ప్రతిష్ఠించి అర్చన, నివేదన, మంగళహారతి అనంతరం నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల ఏర్పాట్లను ఆలయ ఈఓ జీ.శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ పి.కేశవరావు, కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు మురళీకృష్ణ అలంకారంలో పొన్న వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ అధికారులు తెలిపారు.

గురుకులం సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు బాలికల గురుకుల పాఠశాలలో 5 నుంచి 8 తరగతుల వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అమ్మనబ్రోలు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ ప్రియదర్శిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఏప్రిల్ 24వ తేదీవరకు గడువు ఉందన్నారు. అభ్యర్థులు 2021-23 విద్యా సంవత్సరాల్లో 3,4 తరగతులు అభ్యసించిన వారు మాత్రమే 5వ తరగతికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో విద్యార్థులు తమ పాఠశాలలో ప్రవేశాలకు అర్హులుగా తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 2021 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బాలికలు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31వతేదీ మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతి బీసీ(ఏ)-1, 7వ తరగతి ఎస్సీ -1, 8వ తరగతిలో బీసీ(బీ)-1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులకు మే 20వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రంగస్వామి హుండీ ఆదాయం రూ.15,38,196

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ కానుకలు, విరాళాల రూపంలో రూ.15,38,196 ఆదాయం సమకూరినట్లు ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం హుండీ కానుకలను ఈఓతోపాటు ఆలయ చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. రంగరాయకస్వామి ఆలయ హుండీ కానుకల ద్వారా రూ.11,23,276, శివాలయం హుండీ ద్వారా రూ.17,238, దర్శనం, తలనీలాల టికెట్ల విక్రయం ద్వారా రూ.1,26,870, కల్యాణం కట్టడి ద్వారా రూ.60 వేలు, కల్యాణం చదివింపుల ద్వారా రూ.82,645, విరాళాల రూపంలో రూ.22,600, క్లాత్ హుండీ ద్వారా రూ.95,755, ఆదిలక్ష్మి అమ్మవారి హుండీ ద్వారా రూ.9,812 ఆదాయం వచ్చిందని ఈఓ వివరించారు.



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐజీ సహకారం

మరువలేం



ఐజీ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ మలికాగర్గ్, ఏఎస్పీ నాగేశ్వరరావు



ఐజీ దంపతులను సన్మానిస్తున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర అధికారులు

ఒంగోలు టౌన్: గుంటూరు రేంజ్ ఐజీగా డాక్టర్ త్రివిక్రమ్ వర్మ అందించిన సహకారం మరచిపోలేమని ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. విశాఖపట్నం కమిషనర్‌గా బదిలీ అయిన డాక్టర్ త్రివిక్రమ్ వర్మ, ఆయన సతీమణి సువర్ణవర్మను సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు, ఇరు జిల్లాల పోలీస్ అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ.. ఐజీ పర్యవేక్షణలో ప్రతిభావంతంగా పనిచేయగలిగామని చెప్పారు. ఆయన పరిపాలన దక్షత, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. అంకితభావంతో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. సిబ్బంది సంక్షేమానికి తీసుకున్న చర్యలు, గుంటూరు రేంజ్‌లో పోలీస్ శాఖలో చేసిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. ఐజీ తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఐజీ సహకారంతో బాపట్ల జిల్లాల్లో పలు కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఎలాంటి సమస్య అయినా సానుకూలంగా స్పందించి సమయస్ఫూర్తితో పరిష్కారం చూపగల సమర్థవంతమైన అధికారి డాక్టర్ త్రివిక్రమవర్మ అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు ఉత్తమ సేవలందిస్తానని తెలిపారు.

సిబ్బంది అభిమానానికి కృతజ్ఞతలు

ఇరు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు తనపై చూపిన అభిమానానికి ఐజీ త్రివిక్రమ్ వర్మ కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలతో ఉన్న అనుబంధం ఎన్నటికీ మరువలేనిదన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో నిబద్ధతతో విధులు నిర్వర్తించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమర్థవంతంగా పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలనందించి పోలీసు శాఖ ప్రతిష్ఠ పెంచాలని ఆకాంక్షించారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత సురానా, ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వర రావు, బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఇరు జిల్లాల డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.